సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు మానవ హక్కుల కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంగా నిర్వహించనున్న సమావేశంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బీఎస్ లత, కార్యదర్శి పైలా సన్యాసిరావు, డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్ చంద్రకళ, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎంజే రావును సమావేశంలో సత్కరించనున్నట్టు చెప్పారు. మానవ హక్కుల కమిషన్, కోర్టుల పనితీరుపై పలువురి ప్రసంగాలు ఉంటాయని శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

వెంకటపతిరాజునగర్‌లో అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు వెంకటపతిరాజునగర్‌లో వెలసిన దుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగంపల్లి తాతారావు, బెవర మహేష్, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, కోరాడ సురేష్, దల్లై కిషోర్ బాబు, ఎర్రంశెట్టి రమేష్, అప్పలరాజు, అడపా శివ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆశ్రయం


దీనస్థితిలో వున్న వెంకటరావును కేజీహెచ్‌కు తరలిస్తున్న ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం: ప్లాస్టిక్ బ్యానర్లతో నిర్మించిన గుడిసెలో నివసిస్తున్న తల్లీకొడుకులను ఏయూటీడీ సిబ్బంది సంరక్షించారు. పెదవాల్తేరులో రెడ్‌క్రాస్ షెల్టర్‌కు సమీపంలో వారు ఉంటున్నట్లు ఏయూటీడీ, నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి సమాచారం రావటంతో ఆమె అక్కడికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితులు జుగుప్సాకరంగా కనిపించాయి. వృద్ధురాలి కుమారుడు వెంకటరావు కుడికాలు కుళ్లిపోయి, పురుగులు పట్టి, కోళ్లు పొడుచుకు తింటు కనిపించాయి. దీంతో ఆయనను అక్కడి నుంచి 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల సురేష్ సహకారంతో అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. అతని తల్లికి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఆమెను షెల్టర్‌కు తరలిస్తుండగా మరొక మహిళ మతిస్థిమితం లేకుండా రోడ్డుపై తిరుగాడుతుండగా ఆమెను కూడా వసతి గృహానికి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



తిరువీధి ఉత్సవంలో హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీరామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. హనుమత్, సీతారామలక్ష్మణ విగ్రహాలకు బంగారుమెట్ట, కుమ్మరవీధి, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

క్లాక్.. క్లాప్

- 200 ఏళ్ల కేజీహెచ్ గడియారం
- బ్రిటిష్ కాలంలో ఏర్పాటు
- ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్న అధికారులు


వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా


గడియారం రిపేరు చేయిస్తున్న అధికారులు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ వైపు చూడగానే మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది బ్రిటిష్ కాలం నాటి గడియారం. లండన్ నుంచి తీసుకొచ్చిన ఈ గడియారానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. ఆస్పత్రికి మణిహారంలా భాసిల్లే ఈ గడియారాన్ని నాటి బ్రిటిష్ పాలకులు దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అంత పురాతనమైనది అయినా కూడా ఈ గడియారం ఇప్పటికీ పని చేసేలా ఆస్పత్రి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఘన చరిత్ర కలిగిన ఈ గడియారం గతంలో ఒకసారి 40 ఏళ్ల పాటు మరమ్మతులకు గురై తిరగకుండా మొరాయించింది. దీంతో 1985లో ఆస్పత్రి అధికారులు స్థానిక వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్‌కు దీని మరమ్మతు బాధ్యతలు అప్పగించారు. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న ఆయన ఆగిపోయిన ఈ గడియారం పనిచేసేలా చేసి అధికారుల మన్ననలు పొందారు. అప్పటి నుంచి గడియారం పర్యవేక్షకుడిగా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. గడియారం నిరంతరం పని చేసేందుకు టైమ్ మిషన్లు ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ సమయంలో గడియారంలోని ముళ్లు విరిగిపోయాయి. గడియారం కూడా దెబ్బతింది. దీంతో వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా ప్రత్యేకంగా ముళ్లు తయారు చేసి అమర్చారు. ఈ గడియారంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులోని నిమిషాల ముళ్లు పొడవు 4 మీటర్లు, గంటల ముళ్లు పొడవు 3.5 మీటర్లు కాగా.. అంకెలన్నీ ఇనుముతో తయారయ్యాయి. చతురస్రాకారంలో గడియారం చుట్టూ గ్లాసమ్ బోర్డు అమర్చారు. రాత్రివేళ కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గడియారం పర్యవేక్షణకు ఏటా రూ.13 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్ని పెంచాలని వాచ్ మేకర్ కోరుతున్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న అభిమానులు

డాబాగార్డెన్స్: సినీ నటుడు అక్కినేని అఖిల్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఏపీ స్టేట్‌వైడ్ అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ఫ్యాన్స్ అండ్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాము యాదవ్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ముందుగా బొబ్బిలికి చెందిన అక్కినేని సీనియర్ అభిమాని లంక వాసుదేవరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నవీన్ ప్రసాద్, దిబ్బ శంకరరావు, పీవీ రమణారెడ్డి, కె.శ్రీనివాస్, బొట్ట మురళీకృష్ణ, రాజు, కిషోర్, శివమణి, గణ, శ్రీను, చిన్నరాజు, జోజి, అభిమానులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలకు సిద్ధం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజాబలులు, ప్రార్థనలు నిర్వహించారు. రక్షకుడైన క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజా బలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.

నేడు కొత్తమ్మవారి ఆలయ వార్షికోత్సవం


ఉమా కాశీవిశ్వేశ్వరస్వామి


అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారు

అల్లిపురం: అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మవారి 13వ ఆలయ వార్షికోత్సవం, ఉమా కాశీవిశ్వేశ్వర దేవాలయం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని భగవంతుని సేవలో తరించాలని వారు కోరారు.

ఉత్సాహంగా నేషనల్ జూ లవర్స్ డే


చిన్నారులకు జంతువుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస

బీచ్‌రోడ్డు : ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్‌లో శనివారం నేషనల్ జూ లవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు జూలోని వివిధ రకాల జంతువుల జీవన విధానాన్ని స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస వివరించారు. జంతువుల అలవాట్లు, ప్రవర్తనను ఎంతో ఆసక్తితో చిన్నారులు తెలుసుకున్నారు. సింహాలు, పులులు, కోతులు మొదలైన వాటి కథలు చిన్నారులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్


శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పిస్తున్న ద్వారం త్యాగరాజు, మండపాక శారద

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు.

డ్రైవర్లు, కండక్టర్ల శిక్షణపై ఆరా


డిపో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం : సురక్షిత ప్రయాణానికి ప్రజా రవాణా వ్యవస్థ లక్ష్యంగా ప్రతి ఒక్క డ్రైవర్, కండక్టర్ విధులు నిర్వహించాలని ఏపీ ప్రజా రవాణా వ్యవస్థ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనాయుడు అన్నారు. మద్దిలపాలెం సిటీ డిపోను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిపోలో డ్రైవర్ల, కండక్టర్ల విధులు నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజా న్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా వ్యవస్థ ను ఆశ్రయించే ప్రతి ఒక్క ప్రయాణికుడు క్షేమం సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలన్నా రు. ఇంధన పొదుపు పాటించాలని సూచించా రు. సమాజ హితం కోసం సుశిక్షితులైన డ్రైవర్ల ను తయారు చేయడానికి నిష్ణాతులైన వారితో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, అసిస్టెంట్ మేనేజర్ బిందు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు


సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కలిగియు వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు తొలి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన చేపట్టారు.

కలియుగ వెంకన్న ఆలయంలో..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలపై శిక్షణ

మురళీనగర్: గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం 5వ తరగతి అర్హత కలిగి చదవడం, రాయడం తెలిసి ఉన్న 18 నుంచి 45 ఏళ్ల వయసు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు, పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా విదేశాల్లోని మతపరమైన సంస్కృతీ సంప్రదాయాలు, వారి జీవన విధానాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాల చెల్లింపు, పనిచేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం బాధ్యత తీసుకుని తగిన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తీక్ 94942 02677 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. https://kaushalmahotsav.nsdcdigital.org/International/Candidate/ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ఉజ్వల భవిష్యత్తుకు చదువే ఆయుధం


నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువే శక్తివంతమైన ఆయుధమని శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్ వి.షణ్ముఖరావు, కరస్పాండెంట్ కె.సాయి చంద్రిక అన్నారు. పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఎంవీపీ కాలనీ లోని పాఠశాల ఆవరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. చిన్నారుల ఉన్నత భవిష్యత్‌కు, ప్రపంచ ప్రగతికి బాటలు వేసేది చదువు ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

శనివారం రెండో రోజు కూడా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పలు వార్డుల్లో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని ప్రజలతో మమేకం అయ్యారు.


జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కార్యకర్త కుటుంబానికి నగదు అందిస్తున్న వాసుపల్లి


బాబూకాలనీలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జ్ఞానాపురంలోని సెబాస్టియన్‌కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, బాబూకాలనీల్లో వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత నాయకులు స్వలాభం కోసం ప్రజలను మోసం చేశారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేయాలని దృఢ సంకల్పంతో పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు మీరందరూ మద్దతుగా ఉండాలని ఆయన కోరారు. ప్రజల అనుమతితో గోడలకు స్టిక్కర్లు అంటించారు. అనంతరం కోడిగుడ్ల శ్రీధర్ సొంత నిధుల నుంచి వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మజ్జి సూకరాజు పిల్లల స్కూలు ఫీజు నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. వేశంగిణిరావు, శ్రీనివాస్, ఆనంద్, ఈశ్వరి, దేవి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కమల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. 33వ వార్డులో కుమ్మరవీధి సచివాలయం ఆధ్వర్యంలో శనివారం వార్డు నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, గృహసారథి సీహెచ్ కళ్యాణి, వలంటీర్లు కనకదుర్గ, హేమలత కుమ్మరవీధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించి ప్రభుత్వ పథకాలను వివరించారు.

30వ వార్డులో..

డాబాగార్డెన్స్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం 29, 30 వార్డుల్లోని రామజోగిపేట, ఆకాశవీధిలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో క్లస్టర్-4 ఇన్‌చార్జి పీతల వాసు, 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పార్టీ నాయకులు సత్యనారాయణ, దశమంతుల మాణిక్యాలరావు, కన్వీనర్లు కోరాడ సురేష్, అడపా శివ, దశమంతుల చిన్ని, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


రామజోగిపేటలో ప్రజలతో మమేకమైన కార్పొరేటర్ అప్పలరత్నం, పీతల వాసు తదితరులు


గృహిణికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పాల శ్రీహరిరెడ్డి

జగనన్ననే మళ్లీ సీఎం చేసుకుందాం


పండావీధిలో సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్న విల్లూరి

జగదాంబ: శనివారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పండావీధి, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాల్లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వం నాలుగేళ్లుగా చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించారు. ప్రజల కోసం అహర్నిశలు కష్టపడుతున్న జగనన్ననే మళ్లీ మనమందరం ముఖ్యమంత్రిని చేసుకుందామని విల్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌పై అనర్హత వేటు


ఉద్యమ పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డాబాగార్డెన్స్: మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆరోపించారు. నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి పంపనున్న ఉద్యమ పోస్టుకార్డులను ప్రదర్శించారు. అనంతరం లక్కరాజు మాట్లాడుతూ మోదీ ప్రియమిత్రుడు అదానీకి రూ. 20 వేల కోట్లు ఎలా వచ్చాయో తెలపాలని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై కక్ష గట్టారని అన్నారు. దీనిని నిరసిస్తూ పెద్ద ఎత్తున పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. నగర అధ్యక్షుడు గోవిందరాజు మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం నష్టం లేదన్నారు. పార్టీ నాయకులు వేగి వెంకటేష్, సతీష్, శివ, రామకృష్ణ, చరణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

గాజువాక : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15న మధ్యాహ్నం రెండు గంటలకు గాజువాకలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఎన్ఏడీ, కరాస మీదుగా బీచ్ రోడ్‌లోని పార్కు హోటల్ వరకు, అక్కడి నుంచి కాళీమాత ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు బాటా శ్రీను, కట్ట పద్మ, పేర్ల అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల చేసి సుప్రభాతం చదివి వినిపించారు. మేళతాళాల మధ్య అర్చకులు, భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామికి అభిషేకాల అనంతరం ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన సమర్పించారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు.